గుడుంబా పట్టివేత

చెన్నారావుపేట, జనవరి 21: ఎక్సైజ్ పోలీసులు మంగళవారం 10 లీటర్ల గుడుంబా, 1100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. మండలంలోని జీడిగడ్డతండాలో తనిఖీలు చేపట్టారు. తండాకు చెందిన మోహన్, సరిత గుడుంబా తయారు చేస్తుండడంతో 10 లీటర్ల సారా, 1100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై శార్వాణి, వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

గీసుగొండ/ఖిలావరంగల్, జనవరి 21: పేకాడుతున్న వారిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు. గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ స్తంభంపల్లి శివారులోని నలుగురు పేకాడుతున్నట్లు పక్కా సమాచారం అందింది. వెంటనే వారిని పట్టుకొని రూ. 31,720 నగదు, 4 సెల్‌ఫోన్లు, ప్లేకార్డులను సీజ్ చేశారు. 15వ డివిజన్ గొర్రెకుంటకు చెందిన జన్ను శ్రీకాంత్, కమణి హరీశ్, శ్రీనివాస్, షకిల్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే, ఓసిటీ డీసీఎం అడ్డా వద్ద పేకాడుతున్నట్లు డ్రైవర్లు మేకల నరేశ్, జెట్టి గోపాల్, కూస నవీన్, పల్లకొండ రమేశ్, బెల్లం కృష్ణను అదుపులోకి తీసుకున్నట్లు మిల్స్‌కాలనీ సీఐ జే వెంకటరత్నం తెలిపారు. వారి నుంచి రూ. వెయ్యి నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

చెన్నారావుపేట, జనవరి 21: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన ఉప్పరపల్లిలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన కాసాని మల్లయ్య(59) మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెందిన అతడు ఈ నెల 18న పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానలో చేర్చించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

ప్రయోగ పరీక్షలకు సన్నద్ధం కావాలి

నర్సంపేట, జనవరి 21: ఇంటర్ ప్రయోగ పరీక్షలకు కళాశాలలు సన్నద్ధం కావాలని డీఐఈవో శ్రీధర్ సుమన్ అన్నారు. పట్టణంలోని ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఫిబ్రవరి 3 నుంచి జరిగే ఇంటర్ ప్రయోగ పరీక్షలకు కళాశాలలో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా ప్రీ ఫైనల్ పరీక్షల తీరుతెన్నులు తెలుసుకొని అధ్యాపకులకు సూచనలు చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

నల్లబెల్లి, జనవరి 21: వివేకానందుడి జయంతిని పురస్కరించుకుని తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి భట్టు సాంబయ్య వివేకానందుడి జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు తహసీల్దార్ ముప్పు కృష్ణ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి సునీత, ఆర్ఐ ఆరూరి కార్తీక్, రంగాపూర్ జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి హెచ్ఎం రఘువీర్ పాల్గొన్నారు.

సీఐగా బాధ్యతల స్వీకరణ

నెక్కొండ, జనవరి 21: నెక్కొండ సీఐగా ఎస్.శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన చంద్రమోహన్ బదిలీపై ఎస్‌బీకి వెళ్లారు. ఆయన స్థానంలో శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సీఐకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నర్సంపేట : మాదన్నపేట గ్రామసభలో ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నారావుపేట: ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై ఏపీవో అరుణను నిలదీస్తున్న గ్రామస్తురాలు రేణుక

కాశీబుగ్గ: జాబితాలో పేరు రాకపోవడంతో బాలాజీనగర్‌లో మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

నెక్కొండ: అలంకానిపేటలో నిలదీస్తున్న ప్రజలను సముదాయిస్తున్న పోలీసులు

రాయపర్తి: కేశవాపురంలో ఫీల్డ్ అసిస్టెంట్ దస్రూనాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

అడుగడుగునా నిలదీత

- నిరసనల మధ్య గ్రామ, వార్డు సభలు
- అర్హులందరికీ పథకాలు అందించాలని డిమాండ్
- ఇండ్ల జాబితాలో పేర్లు లేకపోవడంతో ఆందోళన
- ప్రజలకు నచ్చజెప్పి సభలను తూతూమంత్రంగా ముగించిన అధికారులు
- బందోబస్తు నిర్వహించిన పోలీసులు

నర్సంపేట, జనవరి 21: జిల్లావ్యాప్తంగా మంగళవారం ప్రారంభమైన ప్రజాపాలన గ్రామ సభలు నిరసనల మధ్య కొనసాగాయి. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని మహిళలు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తమ పేర్లు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ప్రజలకు నచ్చజెప్పి సభలను తూతూమంత్రంగా ముగించారు. ఇందులో భాగంగా నర్సంపేట పట్టణంలోని 1, 6, 11, 16, 21వ వార్డుల్లో సభలు నిర్వహించారు. 1వ వార్డులో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ఎండగట్టారు. కౌన్సిలర్ దేవోజు తిరుమల ఆరు గ్యారెంటీల సంగతి ఏంటని అధికారులను ప్రశ్నించారు. అధికారులు ప్రజలకు నచ్చజెప్పి మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు. సభల్లో నర్సంపేట మున్సిపల్ కమిషనర్ ఈ జోనా, సివిల్ సప్లయ్ డీటీ సంధ్యారాణి, వార్డు ఆఫీసర్ భిక్షునాయక్ ఉన్నారు. గ్రామ సభల్లో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. అలాగే, నర్సంపేట మండలంలోని ముగ్దంపురం, భాంజీపేట, మాదన్నపేట, చిన్న గురిజాల, ఇప్పల్‌తండా, లక్నేపల్లిలో గ్రామ సభలు జరిగాయి. మాదన్నపేటలో అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలని బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పెసరు సాంబరాజ్యం, ఉపాధ్యక్షుడు శనిగరం జంపయ్య, మాజీ ఉప సర్పంచ్ మారపాక నర్సయ్య అధికారులకు విన్నవించారు. భాంజీపేటలో ప్రత్యేకాధికారి ఏవో కృష్ణకుమార్‌కు బీఆర్ఎస్ శ్రేణులు వినతిపత్రం అందించారు. ముగ్దంపురంలో నర్సంపేట మండల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి, లక్నేపల్లిలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ మాట్లాడారు. మాదన్నపేటలో ఎంసీపీఐ(యూ) డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి ఆధ్వర్యంలో నాయకులు ప్రత్యేక అధికారులకు వినతి పత్రం అందించారు.

అర్హులందరికీ పథకాల మంజూరు : కలెక్టర్ సత్య శారద

నల్లబెల్లి/నర్సంపేట: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. నల్లబెల్లి మండలంలోని రేలకుంట, అర్వయ్యపల్లెలో ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. నిబంధనల మేరకే లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. సభల్లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, మండల ప్రత్యేక అధికారి గోవిందరాజన్, తహసీల్దార్ మప్పు కృష్ణ, ఎంపీడీవో నర్సింహమూర్తి పాల్గొన్నారు. అలాగే, కొండాపూర్‌లో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. రంగాయ చెరువు రిజర్వాయర్ ప్రాజెక్ట్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు గూబ రాజు మాట్లాడుతూ ప్రాజెక్ట్ రీడిజైన్ వల్ల ఏడు గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని, పార్టీలకతీతంగా ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అలాగే, నర్సంపేట పట్టణంలోని సర్వాపురం ముదిరాజ్‌కాలనీలో ఏర్పాటు చేసిన వార్డు సభలో కలెక్టర్ సత్యశారద పాల్గొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జాబితాలో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నల్లబెల్లి: రేలకుంటలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

అధికారులను ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలు

చెన్నారావుపేట: లబ్ధిదారుల ఎంపికపై చెన్నారావుపేట మండలంలో నిర్వహించిన గ్రామ సభలు నిరసనలు, నిలదీతల మధ్య కొనసాగాయి. మండల కేంద్రంతోపాటు శంకరాంతండాలో ప్రజల తరపున ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నేతలు దౌర్జన్యానికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య అన్నారు. శంకరాంతండా, లింగిగిరి, ధర్మతండా, సూర్యపేటతండా, తిమ్మరాయిన్‌పహాడ్‌లో సభలు జరిగాయి. చెన్నారావుపేటలో ప్రత్యేక అధికారి బాలకృష్ణ, తహసీల్దార్ ఫణికుమార్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. జాబితాలో ఉన్న వారి పేర్లు వెల్లడించాలని బీఆర్ఎస్ నేతలు అధికారులను కోరగా.. కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకోని అధికారులు సమాధానం చెప్పకుండా అడ్డుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల ఎంపికపై ప్రజలు అధికారులను ప్రశ్నించగా.. సమాధానం చెప్పకుండా కాంగ్రెస్ నాయకులు వారిపై దూషణలకు దిగారు. గ్రామానికి చెందిన ఎదురబోయిన రేణుక ఆత్మీయ భరోసాకు సంబంధించి లబ్ధిదారులను ఎలా ఎంపిక చేశారని, భూమి ఉన్న వారి పేర్లు, ఒకే కుటుంబంలో ఇద్దరి పేర్లను అర్హులుగా చేర్చారని ఏపీవో అరుణను నిలదీయగా.. సమాధానం చెప్పలేకపోయింది. బీఆర్ఎస్ శ్రేణులు అధికారులను ప్రశ్నిస్తుండగా కాంగ్రెస్ నాయకులు పదేపదే జోక్యం చేసుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు.

అర్హులను ఎంపిక చేయాలి : ఎమ్మెల్యేలు

దుగ్గొండి/వర్ధన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమల్లో నిరుపేదలను గుర్తించి ఎంపిక చేయాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. దుగ్గొండి మండలంలో దొంతి మాధవరెడ్డి, వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద, నియోజకవర్గ కేంద్రంలోని 9వ వార్డులో నిర్వహించిన సభల్లో నాగరాజు పాల్గొన్నారు. మొదటి విడత జాబితాలో పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దుగ్గొండిలో నర్సంపేట ఆర్డీవో ఉమరాణి, మండల ప్రత్యేక అధికారి సంగీత లక్ష్మి, ఏసీపీ కిరణ్‌కుమార్, ఎంపీడీవో అరుంధతి, తహసీల్దార్ రవిచంద్రరెడ్డి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్, వర్ధన్నపేటలో మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ, కౌన్సిలర్లు రామకృష్ణ, రవీందర్, సుధీర్, శ్రీలత, మున్సిపల్ కమిషనర్ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

పథకాలపై స్పష్టత ఇవ్వని అధికారులు

ఖానాపురం: ఖానాపురం మండలంలోని ఖానాపురం, బుధరావుపేట, అశోక్‌నగర్, మంగళవారిపేటలో నిర్వహించిన గ్రామ సభలు ఉద్రిక్త వాతావరణం మధ్య కొనసాగాయి. రైతు భరోసా రూ. 6 వేలు కాకుండా పెండింగ్‌లో ఉన్న రూ. 17,500 చెల్లించాలని, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక అధికారులు చేపడతారా లేదా కాంగ్రెస్ నాయకులు చేపడతారా అని అధికారులను నిలదీశారు. బుధరావుపేట, అశోక్‌నగర్‌లో అర్హులు, బీఆర్ఎస్ నాయకులతో కాంగ్రెస్ నేతలు వాగ్వాదానికి దిగారు. ఖానాపురంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, పూర్ణచందర్‌రావు, రాజు, రాజశేఖర్ ప్రభుత్వ పథకాలపై అధికారులను ప్రశ్నించడంతో కాంగ్రెస్ నేతలు హరిబాబు, సాగర్‌రావు, ప్రసాదరావు వాదనకు దిగడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను శాంతింపజేశారు. అశోక్‌నగర్, బుధరావుపేటలోనూ అర్హులు, కాంగ్రెస్ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. అధికారులను నిలదీసినా వారు పథకాల అమలుపై స్పష్టత ఇవ్వలేదు. మండల స్పెషలాఫీసర్ సౌజన్య, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో సునీల్‌కుమార్, ఏవో శ్రీనివాస్, ఎస్సై రఘుపతి పాల్గొన్నారు.

అనర్హులకు చోటుపై అధికారుల నిలదీసిన

నెక్కొండ: నెక్కొండ మండలంలో పోలీసుల బందోబస్తు నడుమ నిర్వహించిన గ్రామ సభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. ఆరు గ్యారెంటీల అమలు, రైతు భరోసా పథకంలో అనర్హులకు చోటు దక్కడం, రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ జాబితాల్లో పేర్లు లేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలంకానిపేటలో గ్రామ ప్రత్యేక అధికారి మమత ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో రుణమాఫీపై మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ సూరం రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ మాదాసు రవి, మాజీ వైస్ చైర్మన్ కర్ప్రారపు శ్రీనివాస్ నిలదీశారు. అప్పల్‌రావుపేట, చంద్రుగొండ, చిన్నకోర్పోలు, నాగారంలో ఆరు గ్యారెంటీల అమలుపై అధికారులను నిలదీశారు. చంద్రుగొండ, చిన్నకోర్పోలు, అప్పల్‌రావుపేటలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో అనర్హుల పేర్లు వచ్చాయని, అర్హులకు మొండిచేయి చూపించారని ధ్వజమెత్తారు.

దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ : గ్రేటర్ కమిషనర్

పోచమ్మమైదాన్/ఖిలావరంగల్/కాశీబుగ్గ/కరీమాబాద్: సంక్షేమ పథకాల కోసం దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని వరంగల్ మహానగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. వరంగల్ 22వ డివిజన్ ఇన్నర్‌వీల్ కమ్యూనిటీ హాల్‌లో వార్డు సభ నిర్వహించారు. ప్రస్తుతం ప్రదర్శించిన జాబితాలో పేర్లు లేనివారికి మరో అవకాశం వస్తుందన్నారు. కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, రెవెన్యూ అధికారి షహజాదీబేగం పాల్గొన్నారు. కాగా, పోచమ్మమైదాన్ ప్రాంతానికి చెందిన వృద్ధురాలు జన్ను ఎల్లవ్వ తనకు పింఛన్, రేషన్ రావడం లేదని సమావేశ హాల్ నుంచి బయటకు వెళ్తున్న వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాకు మొరపెట్టుకున్నారు. సీపీ స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వరంగల్ 12వ డివిజన్ దేశాయిపేటలో జరిగిన గ్రామసభలో వరంగల్ తహసీల్దార్ ఎండీ ఇక్బాల్ ప్రభుత్వ పథకాల వివరాలను వెల్లడించారు. ఖిలావరంగల్ తూర్పుకోట పోచమ్మగుడి ప్రాంగణంలో గ్రామసభ నిర్వహించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ ప్రజలను కోరారు. వరంగల్ ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు. కాశీబుగ్గ 19వ డివిజన్ వీకర్స్ సెక్షన్‌కాలనీలోని స్వశక్తిభవనంలో వార్డు సభ ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ ఓని స్వర్ణలతా భాస్కర్ పాల్గొన్నారు. 218 మంది రేషన్‌కార్డులు, 122 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. డీఈ రంగారావు, టీపీవో నవీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ధరంసింగ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, 14వ డివిజన్ బాలాజీనగర్‌లో 440 మంది రేషన్‌కార్డులు, 297 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ ఇక్బాల్‌తోపాటు ఎనుమాముల సీఐ రాఘవేందర్, ఎస్సై రాజు పాల్గొన్నారు. అలాగే, ఉర్సు సీఆర్సీ భవన్‌లో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అధ్యక్షతన వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

షరతులు లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలి

గీసుగొండ/రాయపర్తి: రూ. 2 లక్షలలోపు అందరికీ రుణమాఫీ చేయాలని గీసుగొండ గ్రామ సభలో రైతులు తీర్మానం చేశారు. మండలకేంద్రంతోపాటు ఎలుకుర్తి, మచ్చాపురం, విశ్వనాథపురంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో విజయలక్ష్మి హాజరై మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. జాబితాలో పేర్లు లేని తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. విశ్వనాథపురంలో తహసీల్దార్ రియాజుద్దీన్ మాట్లాడుతూ రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అన్నారు. అంతేకాకుండా వరంగల్ 16వ డివిజన్ ధర్మారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వార్డు సభలో కార్పొరేటర్ సుంకరి మనీషా శివకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో ప్రజల నుంచి మూడుసార్లు దరఖాస్తులు స్వీకరించిందని, దీంతో ప్రజలకు ఒకరిగిందేమీ విమర్శించారు. సంక్షేమ పథకాల్లో కోత విధించేందుకే ప్రభుత్వం దరఖాస్తుల పేరుతో సామాన్యులను ఇబ్బంది పెడుతున్నదని ధ్వజమెత్తారు. అలాగే, రాయపర్తి మండలంలోని కొత్తూరులో తహసీల్దార్ శ్రీనివాస్, సన్నూరులో ఎంపీడీవో కిషన్‌నాయక్, కొండూరులో ఎంపీవో ప్రకాశ్, పెర్కవేడులో రాయపర్తి పశు వైద్యాధికారి శ్రుతి, పోతిరెడ్డిపల్లిలో పీఆర్ ఏఈ తాళ్ల శ్రీప్రియ, ఆరెగూడెంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనూష, కేశవాపురంలో ఏవో వీర భద్రం, ఊకల్‌లో పెర్కవేడు పశు వైద్యాధికారి సుధారాణి సారథ్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గ ప్రత్యేకాధికారి సంధ్యారాణి మాట్లాడుతూ పథకాలకు దరఖాస్తు చేసుకోవడం నిరంతర ప్రక్రియ అన్నారు. కాగా, కేశవాపురం జీపీలో ఏవో వీరభద్రం ఆధ్వర్యంలో జరిగిన సభలో గ్రామస్తులు ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ గుగులోత్ దస్రూనాయక్‌తో వాగ్వాదానికి దిగారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల జాబితాలో కేవలం 60 మంది పేర్లు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమి లేని తమ పేర్లు ఎందుకు చేర్చలేదని నిలదీశారు.

గవిచర్ల గ్రామసభ గందరగోళం

సంగెం: గవిచర్ల గ్రామసభ గందరగోళంగా మారింది. కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. అర్హులను గుర్తించలేదని, ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోసుకోవచ్చా అని అధికారులను మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకులు దొనికెల శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ చెన్నూరి యాకయ్య అడుగుతుంటే అధికార పార్టీ నాయకులు అడ్డుకున్నారు. ఎస్సై నరేశ్ జోక్యం చేసుకుని ఇరు పార్టీల వారిని సముదాయించారు. అలాగే, గవిచర్ల, మొండ్రాయి, కాట్రపల్లి, చింతలపల్లి, పోచమ్మతండా, లోహిత, పోచమ్మతండా, కాట్రపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. కాట్రపల్లిలో డీఆర్డీవో విజయలక్ష్మి హాజరై పథకాల అమలుపై ప్రజలకు వివరించారు.

గ్రేటర్ వరంగల్‌లో వార్డు సభలు షురూ

వరంగల్: జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 20 డివిజన్లలో మంగళవారం వార్డు సభలు నిర్వహించారు. తూర్పు నియోజకవర్గం పరిధిలోని 12, 19, 22, 25, 28, 36, 37, 40, పశ్చిమ నియోజకవర్గంలోని 7, 11, 47, 51, 52, 54, 59, 61, వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని 1, 14, 66, పరకాల నియోజకవర్గం పరిధిలోని 16వ డివిజన్‌లో వార్డు సభలు నిర్వహించారు. దీంతో ప్రజల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వెల్లువెత్తాయి. తొలిరోజు పలు వార్డు సభల్లో ప్రజాప్రతినిధులకు చుక్కెదురైంది. గ్యాస్ సబ్సిడీ, ఉచిత విద్యుత్ అందడం లేదని ప్రజలు కార్పొరేటర్లు, అధికారులను నిలదీశారు. తూర్పులోని 22వ డివిజన్‌లో నిర్వహించిన వార్డు సభకు కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే హాజరయ్యారు. తొలిరోజు 8595 దరఖాస్తులు వచ్చాయి. బుధవారం 18 డివిజన్లలో వార్డు సభలు నిర్వహించనున్నారు.

చెన్నారావుపేట: గ్రామ సభలో బీఆర్ఎస్ నాయకులపై దౌర్జన్యం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

సంగెం: గందరగోళంగా మారిన గ్రామసభ

కరీమాబాద్: మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నన్నపునేని

మృతుల కుటుంబాలకు పరామర్శ

కరీమాబాద్/ఖిలావరంగల్, జనవరి 21: వరంగల్ అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని పలు డివిజన్లలో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పరామర్శించారు. నన్నపునేని వెంట కొంతం మోహన్, బొమ్మగాని కుమారస్వామి, మరుపల్ల గౌతమ్ ఉన్నారు. అలాగే, శివనగర్ విశ్వనాథకాలనీకి చెందిన అంకం సత్యం ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని నన్నపునేని పరామర్శించారు. ఆయన వెంట కార్పొరేటర్ కుమారస్వామి, రవి, గణేశ్, ప్రతాప్, పురుషోత్తం ఉన్నారు.

డాక్టర్ మోహన్‌రావుకు ఎక్సలెన్స్ అవార్డు

మోహన్‌రావును సత్కరిస్తున్న సభ్యులు

కరీమాబాద్, జనవరి 21: వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న డాక్టర్ బందెల మోహన్‌రావుకు ఎక్సలెన్స్ అవార్డు లభించింది. రోటరీ క్లబ్ వరంగల్ శాఖను స్థాపించి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా క్లబ్ సభ్యులు ఆయనకు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డును మంగళవారం ఫోర్టురోడ్డులోని రోటరీ క్లబ్‌లో అందజేశారు. కార్యక్రమంలో కురువెల్ల రాజగోపాల్, వంగల రమేశ్, డాక్టర్ శరత్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

పర్వతగిరి, జనవరి 21: నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ముద్రించిన కరపత్రాలను ఎంఈవో గాయపు లింగారెడ్డి చేతులమీదుగా మంగళవారం ఆవిష్కరించినట్లు పర్వతగిరి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం పాక రమేశ్‌బాబు అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ లోడ్‌తో ప్రయాణించడం, అతివేగంగా వాహనాలు నడపడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఈవో లింగారెడ్డి

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, జనవరి 21: గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె డీసీపీ రవీందర్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రొటోకాల్‌కు అనుగుణంగా అతిథులకు ఆహ్వానం పంపించాలన్నారు. ఈ నెల 25లోగా ప్రశంసాపత్రాలు సిద్ధం చేయాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్డీవో పీడీ కౌసల్యాదేవి, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి పాల్గొన్నారు. అలాగే, కలెక్టరేట్‌లో వీ హబ్, సంబంధిత అధికారులతో సత్య శారద సమీక్షించారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు జిల్లాకేంద్రంలో నైపుణ్య అభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పిలిగిరి ఆర్ట్, లేస్‌ల తయారీ, గుర్రపు డెక్కల ద్వారా వస్త్రాల తయారీ, జొన్నల ద్వారా టీ కప్పుల తయారీ తదితర అంశాలపై మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విజయలక్ష్మి, డీపీవో కల్పన, వీ హబ్ సంచాలకుడు జూహిద్ అక్తర్‌షేక్, సహాయం సంచాలకుడు ఊహ, డీపీఎం రేణుక పాల్గొన్నారు.

తొలి రోజు 87 గ్రామ సభలు

తొలి రోజు 87 గ్రామ సభలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. రేష